

ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

ఐటిఐలో వివిధ ట్రేడుల్లో రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ ఎల్ఆర్ఆర్.క్రిష్ణన్ తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన, ఇంటర్ ఫెయిల్ అయిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు యొక్క అన్ని ధ్రువ పత్రాలతో iti.ap.gov.in వెబ్‌సైట్‌లో 29 జూన్ 2024 నుండి 24 జులై 2024 సాయంత్రం 5గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ధరఖాస్తు చేసుకున్న అభ్యర్థులుకు జూన్ 29 నుంచి జూలై 25 సాయంత్రం 5 గంటల వరకూ వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఇక జత జిరాక్స్ కాపీలతో వచ్చి వెరిఫికేషన్ చేయించుకుని రశీదు పొందాలన్నారు. వివరాలకు 9294050231, 7801095303 నెంబర్లను సంప్రదించాలన్నారు.

సమన్వయంతో జిల్లా అభివృద్ధి

- ఈ-ఆఫీస్‌లోనే కార్యాలయ ఉత్తర ప్రత్యుత్తరాలు
- విధుల నిర్వహణలో జవాబుదారీ తనం అవసరం
- బాధ్యతలు చేపట్టిన నూతన జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

కలెక్టర్ నిర్వహించిన సమీక్షా సమావేశానికి హాజరైన అధికారులు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు, ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలను అమలు చేయడంలో అధికారులు సమన్వయం చేసుకోవాలని, పూర్తి స్థాయిలో సహకారం అందించాలని కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. కలెక్టరేట్‌లో ఆమె శుక్రవారం బాధ్యతలను చేటప్టారు. అనంతరం అధికారులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు వ్యక్తిగత బాధ్యత తీసుకుని జవాబుదారీ తనం కలిగి ఉండాలన్నారు. జిల్లాలో ఇకపై ప్రతి ప్రభుత్వ శాఖ నిర్వహించే ఉత్తర ప్రత్యుత్తరాలు 'ఈ - ఆఫీసు' ద్వారానే నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు, ఉత్తర్వులు మేరకు అధికారులు వ్యక్తిగత బాధ్యత తీసుకుని విధులను నిర్వర్తించడం అత్యంత కీలకమన్నారు. ప్రతికూల వార్తల నేపథ్యంలో ఆయా అంశాలపై విశ్లేషణ చేసుకుని వాటి పరిష్కార మార్గాలు, సమస్య మూలలు తెలుసుకుని పరిష్కార దిశగా అడుగులు వేయాలని అధికారులకు సూచించారు. పలువురు అధికారులు ఈ సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లాలో 2,44,302 మంది లబ్దిదారులకు పింఛన్లు

జిల్లాలో 2,44,302 మంది లబ్ధిదారులకు జూలై 1న ఎన్‌టిఆర్ భరోసాలో భాగంగా పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో డివిజనల్, మండల, మునిసిపల్ స్థాయి అధికారులతో పింఛన్లు పంపిణీ, సిజనల్ వ్యాధులు, స్వచ్ఛమైన తాగునీటి సరఫరా అంశలపై జెసి ఎన్.తేజ్‌భరత్‌తో కలిసి దిశానిర్దేశం చేశారు. ఈ సంధర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పింఛన్ల పంపిణీని సజావుగా నిర్వహించాలన్నారు. జూన్ 29న బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసుకోవాలన్నారు. జూలై 1వ తేదీ ఉదయం 5 గంటల నుంచి నగదు చెల్లింపులు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో 9,552 క్లస్టర్ వారీగా 2,44,302 మంది పెన్షన్ లబ్దిదారులను గుర్తించామన్నారు. ఆయా క్లస్టర్ వారీగా సిఎఫ్ఎంఎస్ గుర్తింపు కలిగిన ప్రభుత్వ ఉద్యోగులకు లబ్ధిదారులను అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. ఆధార్ బేస్డ్, బయో మెట్రిక్, ఐరిష్ గుర్తింపు విధానంలో చెల్లింపులు జరపాలన్నారు. ప్రతి ఒక్కరి నుంచి నగదు చెల్లింపులకు చెందిన రశీదు తీసుకోవాల్సి ఉంటుందని ఆదేశించారు.

సీజనల్ వ్యాధుల అప్రమత్తంగా ఉండాలి

ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సీజనల్ వ్యాధుల వ్యాప్తి చెందకుండా తగిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆమె ఆదేశించారు. వర్షాకాలం దష్ట్యా లోతట్టు, ముంపు ప్రాంతాలను గుర్తించి సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. డయేరియా కేసులు నమోదు అయిన సందర్భంలో ఆయా ప్రాంతాల్లో పర్యటించి క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితిని అధ్యయనం చేసి, నివేదిక అందచేయాలని తెలిపారు. తాగునీటి నమూనా పరీక్షలు నిర్వహించి, ఆమేరకు ధ్రువపత్రాలు జారీ చేయాలన్నారు. తాగునీటి ట్యాంకులను స్వయంగా తనిఖీ చేసి రెండు మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ ఎన్‌వివిఎస్.మూర్తి, జిల్లా సూక్ష్మ నీటి యాజమాన్య అధికారి ఎ.దుర్గేష్, జిల్లా భూగర్భ జల అధికారి వై.శ్రీనివాస్, డివిజనల్ అభివృద్ధి అధికారులు పి.వీణాదేవి, వి.శాంతమణి, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, ఎల్‌డిఎం డివివి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

బాలికలకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలి

సమీక్షా సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

పాఠశాలలలో విద్యార్థినిలకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని, అప్పుడే డ్రాప్ అవుట్స్ తగ్గుతాయని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శుక్రవారం ఉండ్రాజవరం శ్రీ సుధీంద్రబాబు ధార్మిక ట్రస్ట్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన మండల స్థాయి అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తొలుత మంత్రి, నిడదవోలు మాజీ ఎంఎల్‌ఎ బూరుగుపల్లి శేషారావు విద్యార్థులకు విద్యా కిట్లను పంపిణీ చేశారు. అనంతరం శేషారావు మాట్లాడుతూ నియోజకవర్గానికి దుర్గేష్ గెలుపు ప్రజల అదృష్టమన్నారు. మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ మూడు పార్టీల మేలి కలయిక కూటమి ప్రభుత్వమన్నారు. అభివద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు అందేలా అధికారులు దృష్టి పెట్టాలన్నారు. 1న పెన్షన్ల పండుగ, సచివాలయ ఉద్యోగుల ద్వారా జరుగుతుందన్నారు. వాలంటీర్ల ప్రమేయం లేకుండా నాయకుల సమక్షంలో పింఛన్లను ఇంటింటా పంపిణీ చేయాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా సేవలందించాలన్నారు. డిజాస్టర్ ప్రిపేర్ మెంట్ కోసం సంబంధిత అధికారులు సమావేశం నిర్వహించుకోవాలని, అటువంటి సమయాల్లో పశు సంపదను కోల్పోకుండా చూసుకోవాలన్నారు. బాలికా విద్య పై ఎక్కువ దష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు. .

'నన్నయ్య' అవినీతిపై విచారణ

ప్రజాశక్తి - రాజానగరం

అధికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో జరిగిన అవినీతిపై పూర్తి దర్యాప్తు చేస్తామని రాజానగరం ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ తెలిపారు. మండలంలో పుణ్యక్షేత్రం, నామవరం, కొండగుంటూరు, సంపత్‌నగరం, జి.యర్రంపాలెం, పాతతుంగపాడు, కొత్తతుంగపాడు గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. గ్రామాల్లో సంపత్ నగరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు భోజనం తినిపించారు. అనంతరం చిన్నారులతో భోజనం కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బత్తుల మాట్లాడుతూ ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో భవణాల నిర్మాణం, ఉద్యోగుల నియామకం. విద్యార్థుల ఫీజులు చెల్లింపులు తదితర వాటిల్లో నిధులు దుర్వినియోగం జరిగాయన్నారు. దీనిపై ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్లి పూర్తి విచారణ చేపడతామన్నారు. ఆయన వెంట టిడిపి, జనసేన నాయకులు ఉన్నారు.

చిన్నారులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఎల్‌ఎ బలరామకృష్ణ

పాఠశాలలో డివైఇఒ తనిఖీలు

ప్రజాశక్తి- కడియం

మండలంలోని మాధవరాయుడు పాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో రాజమహేంద్రవరం ఉప విద్యాశాఖాధికారి నారాయణ శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. వివిధ సబ్జెక్టుల ప్యానల్ మెంబర్స్ ఆయన వెంట ఉన్నారు. సీనియర్ ప్రధానోపాధ్యాయులు కెవి.రమణారావు, ఎస్ఎల్‌వి.రమేష్, జి.ప్రమీలరాణి, పి.రాజు, నాగరాజు, గొల్లపల్లి సత్యనారాయణ, బి.సువర్ణవేణి, విజయ్ కుమారి పానల్ మెంబర్లుగా వ్యవహరించారు. విద్యార్థుల రాత పుస్తకాలు, వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధనను పరిశీలించారు. ఉప విద్యాధికారి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ఈ సంవత్సరం మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ మేరకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. 8, 9 తరగతులు విద్యార్థులు ట్యాబులను ఉపయోగిస్తున్న తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వివిఎస్.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

షెడ్డు తొలగించొద్దంటూ వినతి

ప్రజాశక్తి- కడియం

కడియం గ్రామంలో రైతు బజార్ నిర్మాణంలో భాగంగా ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో నిర్మించిన తాత్కాలిక రేకుల షెడ్డును తొలగించకుండా, రైతు బజారు నిర్మాణ పనులు పూర్తి అయిన తర్వాత ప్రజా అవసరాలకు ఉపయోగపడే విధంగా వినియోగించుకోవాలని వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు అన్నారు. ఈనెల 20న పంచాయతీ వారు రైతు బజార్ పక్కన నిర్మించిన తాత్కాలిక రేకుల షెడ్డుని తొలగించాలని, ఆ రేకుల షెడ్డు గోడపై నోటీసు అంటించారు. కడియం గ్రామ ప్రజల విజ్ఞప్తి మేరకు ఈ షెడ్డును ప్రజా అవసరాల నిమిత్తం ఉపయోగించాలని బాబు కోరారు. రైతుబజార్ నిర్మాణ సమయంలో కూలీలకు, మెటీరియల్‌ను నిల్వ చేసుకోవడానికి వీలుగా ఉంటుందన్నారు. ఈ మేరకు తహశీల్దార్, ఎంపిడిఒలను కోరామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దాసరి శేషగిరి, శాకా పట్టాభి, ఆర్ఎస్ఎన్.మూర్తి, బట్టు చిన్ని, దొడ్డా బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

సిఎం, డిప్యూటీ సిఎం ఫొటోల ఏర్పాటు

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి గ్రామంలోని మూడు సచివాలయాల్లో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం కొణెదల పవన్ కళ్యాణ్ ఫోటోలను కూటమి నాయకులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఇన్‌ఛార్జి డి.సువర్ణ రాజు, టిడిపి నాయకులు గన్నమని హరికృష్ణ మాట్లాడారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపడానికి ఎన్‌డిఎ కూటమి పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కంబాల సత్తిబాబు, యాగంటి వెంకటేశ్వరరావు, ఉప్పులూరి రామారావు, ఎన్‌డిఎ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్టూన్'నిజం'



ముస్లిములపై దాడులు తగవు

ప్రజాశక్తి - నిడదవోలు

నిరసన తెలుపుతున్న రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు, ముస్లిములు

దేశవ్యాప్తంగా ముస్లింలపై విషపూరిత దాడులు. విద్వేషపూరిత ప్రసంగాలు ఖండిస్తూ నిడదవోలు రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. రాజ్యాంగ పరిరక్షణ వేదిక కన్వీనర్ జువ్వల రాంబాబు మాట్లాడుతూ లోక సభ ఎన్నికలఫలితాలు వెలువడినప్పటి నుండి దేశంలో పలు ప్రాంతాల్లో ముస్లిములపై పెద్దఎత్తున దాడులు పెరిగాయన్నారు. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్‌లో ఎద్దులను రవాణా చేస్తున్న ముగ్గురు ముస్లిం యువకులను ఆవుల స్మగ్లర్లుగా ముద్ర వేసి గో గుండాలు కొట్టి చంపేశారన్నారు. ఆలీఘడ్‌లో దొంగతనం చేశాడనే ఆరోపణలపై ఒక ముస్లిం యువకుడ్ని కొట్టి హత్య చేశారన్నారు. మధ్యప్రదేశ్లో మండాలాలో ఫ్రిజ్‌లో గొడ్డు మాంసం ఉందన్న అపోహలతో ముస్లింలకు చెందిన 11 ఇళ్లను ధ్వంసం చేశారన్నారు. లక్నోలో రివర్ ఫ్రెంట్ నిర్మాణం పేరుతో ముస్లిములు ఎక్కువగా వుండే అక్బర్ నగర్‌లో ఇళ్లను బుల్డోజర్లతో కూల్చేశారని గుర్తు చేశారు. ఇలా గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీల్లో ముసిముల దుకాణాలపై ఉన్మాదులు దాడులు చేశారన్నారు. కేంద్రంలో బిజెపికి సీట్లు తగ్గడంతో మతోన్మాదుల దాడులు పెరిగాయని రాంబాబు విమర్శించారు. ఈ మతోన్మాద శక్తుల కుతంత్రాలు, కుట్రల అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ఈ దాడులకు ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖయ్యూమ్. జానీ, ఉస్మాన్, మజీద్, అజార్, షరీష్, శ్రీనివాసరావు, ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

బ్లేడు, గంజాయి బ్యాచ్‌లను అరికడదాం

ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

సమావేశంలో మాట్లాడుతన్న ఎంఎల్‌ఎ శ్రీనివాస్

నగరంలో బేడ్, గంజాయి బ్యాచ్‌లు లేకుండా అరికడదామని ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం బర్మా కాలనీలోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయం పక్క రోడ్డులో పోలీసులు, మున్సిపల్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో 'మీ భద్రత- మా బాధ్యత' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లల భవిష్యత్ కోసం కూటమి ప్రభుత్వానికి మహిళలు పెద్ద ఎత్తున మద్దతు ఇచ్చి గెలిపించారన్నారు. అందులో భాగంగానే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. మహిళల భద్రతకు పూర్తి భరోసా ఇస్తామన్నారు. ఆగడాలను అరికట్టే చర్యల్లో భాగంగా ఆయా ప్రాంతాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామన్నారు. ఎటువంటి సమస్య వచ్చిన నాయకులు అందుబాటులో ఉంటారన్నారు. వారు సరిగా స్పందించక పోతే నేరుగా తన మొబైల్ 8693934567కు ఫోన్ చేయొచ్చన్నారు. ఆకతాయిల వివరాలు తెలియజేస్తే పోలీసులు ద్వారా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ కెవిస్.సత్యనారాయణ, ఎక్సైజ్ సిఐ నిక్సన్, నగర మహిళ కమిటీ అధ్యక్షురాలు కోసూరి చండిప్రియ, టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాస్, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా తదితరులు పాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు

కడియం : దామిరెడ్డి పల్లిలో కొండేటి సుజనమ్మ విజయ రత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. రాజమహేంద్ర వరం శ్రీశాంతి ఇఎన్‌టి హాస్పిటల్ వైద్యుల నేతత్వంలో నిర్వహించిన ఈ శిబిరంలో డాక్టర్ సత్తి రవికాంత్ వైద్య పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ చెవి, ముక్కు, గొంతు శరీరానికి ఒక కిటికీ వంటివన్నారు. ఆరోగ్యకరమైన శరీరాన్ని ఇవి ప్రతిబింబిస్తాయని తెలిపారు. వీటిలో ఏదైనా అసౌకర్యం ఉంటే అది మన రోజువారీ కార్యకలాపాలపై ప్రభావం చూపుతుందన్నారు. ఈ శిబిరంలో ఇఎన్‌టి వైద్యులు ద్వారంపూడి శ్రీకాంత్‌రెడ్డి, పిన్నమనేని ప్రియ, ఎ.చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

రాజకీయ వ్యవస్థలో ప్రక్షాళన అవసరం

నల్లజర్ల : రాజకీయ వ్యవస్థలో ప్రక్షాళన జరిగితే మిగిలిన అన్ని వ్యవస్థలను అది ప్రక్షాళన చేస్తుందని ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు అన్నారు. శుక్రవారం నల్లజర్ల ఎంపిడిఒ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన పరిచయ సభలో ఆయన మాట్లాడారు. రాజకీయం వేరు పరిపాలన వేరు అన్నారు. పరిపాలన రాజ్యాంగ బద్ధంగా సాగాలన్నారు. సమర్థులు రాజకీయాల్లోకి రాకపోతే అసమర్థులు రాజ్యమేలతారన్నారు. ప్రభుత్వ ఫలాలు పేదలకు అందేలా చూడాలన్నారు. పలువురు అధికారులు ప్రజా సమస్యలను ప్రజల అవసరాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

ప్రజలకు అవసరమైన సేవలందించాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గంతో పాటు సభ్యులంతా ప్రజలకు అవసరమైన సేవలు అందించాలని క్లబ్ పూర్వపు జిల్లా గవర్నర్ కొత్తపల్లి రవికుమార్ సూచించారు. తాళ్లపూడి మండల లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం జరిగింది. మండలంలోని మలకపల్లి గ్రామంలో గల కళ్యాణ మండపంలో జరిగిన ఈ ఎన్నికల్లో క్లబ్ నూతన అధ్యక్షునిగా కుంటముక్కల వీరభద్ర రావు కార్యదర్శిగా, నున్న సోమశేఖర్‌బాబు కోశాధికారిగా, ఎల్లిన బ్రహ్మానందం, తదితరులు సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో రవికుమార్ ప్రమాణస్వీకారం చేయించారు. లయన్స్ క్లబ్ మండల వ్యవస్థాపకులు జిల్లా కమిటీ సభ్యులు జొన్నలగడ్డ వెంకట సుబ్బరాయ చౌదరి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మిడ్డేమీల్స్ కార్మికులు చీరలు అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు జివి.ప్రసాద్, నామన పరమేశ్వరరావు, కొఠారు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తత

ప్రజాశక్తి - చాగల్లు

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ కె.నిశిత వైద్య సిబ్బందికి సూచించారు. బ్రాహ్మణగూడెం పిహెచ్‌సిలో డయేరియా, సీజనల్ వ్యాధులపై ఎఎన్ఎంలు, ఆశాలు, ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది, ఇతర శాఖల సిబ్బందిలో సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ నిశిత మాట్లాడారు. జూలై 1 నుంచి ఆగస్ట్ 31 వరకు స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలన్నారు. నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులకు ఒఆర్‌సె ప్యాకెట్లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పిఆర్ఎల్.దేవి, వి.పద్మ, సిహెచ్.శ్రీనివాస్, ఎ.రామచంద్రరావు, ఎస్.సారమ్మ ఎం.రాజశేఖర్, ఎంఎల్‌పిహెచ్, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

'మానవతా' నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - తాళ్లపూడి

మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ప్రతిరోజూ నిర్వహించే సేవా కార్యక్రమాలతో పాటు ప్రజలకు శాశ్వతంగా ఉపయోగపడే అభివృద్ధి పనులు కూడా చేయాలని మానవతా జిల్లా శాఖ అధ్యక్షులు తాడేపల్లి మోహనరావు అన్నారు. తాళ్లపూడి మండల మానవతా శాఖ సమావేశం శుక్రవారం తాళ్లపూడిలోనే సొలస సత్యనారాయణ దమయంతి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగింది. ఈ సమావేశంలో నూతన కార్యవర్గంతో జిల్లా అధ్యక్షులు ప్రమాణ స్వీకారం చేయించారు. మండల శాఖ నూతన అధ్యక్షునిగా అంకెం సురేష్, ఉపాధ్యక్షునిగా తిగిరిపల్లి దోసాలు, కార్యదర్శిగా సనపల రాజశేఖర్, కోశాధికారిగా అప్పన హనుమంతరావు, ఇతర సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. మండల శాఖ చైర్మన్ సింహాద్రి జనార్దన్ రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రీజనల్ చైర్మన్ వి చంద్రయ్య వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో గెడ్డం సాయిబాబా, జొన్నలగడ్డ రాంబాబు, పోసి బాబు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి నియోజకవర్గ సమస్యలు

ప్రజాశక్తి -దేవరపల్లి

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ డి.సువర్ణరాజు జనసేన నేతలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా డి సువర్ణరాజు గోపాలపురం నియోజకవర్గ సమస్యలను మంత్రికి వివరించారు. త్యాజంపూడి నుంచి పొంగుటూరు రోడ్డు, గోపాలపురం - దొండపూడి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలన్నారు. దేవరపల్లి లక్ష్మీపురం గ్రామాల మధ్య పోలవరం కాలువపై అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ సమస్యలన్నీ సానుకూలంగా పరిష్కరిస్తామని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కట్నం గణేష్, కృష్ణపాలెం సర్పంచ్ నాయుడు దుర్గాప్రసాద్, సీనియర్ నాయకులు శివనాగప్రసాద్, బాబి, మణికంఠ తదితరులున్నారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి

ప్రజాశక్తి - గోపాలపురం

వ్యాధులను నివారించేందుకు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని హెచ్‌ఎం శ్రీపాద లక్ష్మీనరసింహశాస్త్రి అన్నారు. మండలంలోని చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'డయేరియా, కలుషిత నీటి నివారణ'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 400 మంది విద్యార్థులతో డయేరియా నివారణపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఆహారం తీసుకునే ముందు చేతును శుభ్రంగా కడుక్కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.శ్రీనివాస్, రాఘవకుమారి, భీమేశ్వరరావు సుందరరావు, రమణ, శ్రీనివాస్ రెడ్డి, కౌలూరి సునీత పాల్గొన్నారు.

పీజీ సెట్‌లో ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పీజీ సెట్‌లో ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. వివిధ విభాగాల్లో ఉన్నత ర్యాంకులను పొందారు. బయోటెక్నాలజీ విభాగంలో ఎస్‌టివి.సుష్మ స్టేట్ మొదటి ర్యాంక్‌ను కైవసం చేసుకుంది. పది మందికి పైగా టాప్ టెన్ ర్యాంకులను, 15 మందికి పైగా రెండంకెల ర్యాంకులను సాధించారని ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కె తెలిపారు. జియాలజీ విభాగం కె.రూపవతి స్టేట్ 12వ ర్యాంకు సాధించి సత్తాచాటిందన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర, అధ్యాపకులు అభినందనించారు.

డ్రాయింగ్ టీచర్‌కు సత్కారం

కడియం : కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 12 ఏళ్లుగా డ్రాయింగ్ టీచర్‌గా పనిచేసి ఈ నెలాఖరుకి ఉద్యోగ విరమణ చేస్తున్న చిటిమోజు వీరవెంకటసత్యనారాయణమూర్తి దంపతులను పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది శుక్రవారం ఘనంగా సత్కరించారు. 1982లో ఆయన డ్రాయింగ్ టీచర్‌గా చేరారు. కేశవరం, పేరవరం, కడియం ఉన్నత పాఠశాలల్లో 35 ఏళ్లుగా సేవలందించారు. ఆయన రచించిన ఆత్మాశ్రయ శివశతకాన్ని హెచ్‌ఎం టి.సత్యనారాయణ ఆవిష్కరించారు. శతకానికి చిత్ర కవిత అనే పేరుతో ముందుమాట రాసిన కవి నీలకంఠరావు వీరి పద్యాలు గురించి వ్యాఖ్యానించారు. స్టాఫ్ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ, కర్రి రాజు పలువురు ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, బంధువులు, విద్యార్థులు పాల్గొని మాస్టారును ఘనంగా సత్కరించారు.

గోకవరం ఎస్ఐ నాగరాజుకు అవార్డు

గోకవరం : 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో, కౌంటింగ్ రోజున పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేసి ,శాంతి భద్రతలను కాపాడిన గోకవరం ఎస్ఐ నాగరాజుకు అవార్డు దక్కింది. ఎన్నికల సమయంలో ఎక్కువగా అక్రమ మద్యం, సారా తయారీ, అమ్మకం దారులను పట్టుకోవడంలో ఆయన విశిష్ట ప్రతిభ చూపించారు. ఈ సందర్భంగా ఎస్పి పి.జగదీష్ ఆయన్ని అభినందించి క్యాష్ రివార్డుతో పాటుగా ప్రశంసా పత్రాన్ని అందించారు.

వెంకన్న దేవస్థానం భూముల వేలం

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని అన్నవరప్పాడులో ఉన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన 2.53 ఎకరాల భూమిని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం పరివేక్షణ అధికారి ఎంవి.రామయ్య పర్యవేక్షణలో వేలం నిర్వహించారు. ఈ వేలం ద్వారా దేవస్థానానికి రూ.1,01,300 ఆదాయం సమకూరిందని తీపర్రు గ్రూపు దేవాలయంల కార్యనిర్వహణ అధికారి ఎంవి.రామయ్య తెలిపారు ఈ వేలంలో దేవస్థాన కార్య నిర్వహణ అధికారి ఎం.రాధాకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చోరీ కేసులో వ్యక్తికి జైలు

ప్రజాశక్తి-ఆలమూరు

ఒక వ్యక్తికి దొంగతనం కేసులో నేరం రుజువు కావడంతో అతనికి జైలు శిక్ష విధించినట్లు శుక్రవారం ఎస్ఐ ఎల్.శ్రీను నాయక్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం 2021 అక్టోబర్ నెలలో మండలంలోని గుమ్మిలేరుకు చెందిన రెడ్డి భాస్కరరావు తను అద్దెకు ఉంటున్న ఇంటికి చదమందు కొట్టే క్రమంలో బీరువా తాళాలు డైనింగ్ టేబుల్ మీద మర్చిపోయాడు. ఈ క్రమంలో మూడు నెలలు తర్వాత వేరే తాళంతో బీరువా తెరిసి చూడగా అందులో ఉండాల్సిన బంగారం, వెండి వస్తువులు దొంగిలించబడ్డాయి. దీంతో బాధితుని ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ ఎస్.శివప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేశారు. ఈ దర్యాప్తులో 2022 మార్చి 3న రాజమహేంద్రవరం లోని ఆనందనగర్‌కు చెందిన కోడి సతీష్ కుమార్(కాకి)ను పీటీ వారింటిపై అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. కోర్టులో ఎపిపి శ్రీరాములు వాదనలు వినిపించగా కోర్టు హెడ్ కానిస్టేబుల్ జి.ప్రభాకర్ రావు సహకరించారు. చివరకు నిందితుడు సతీష్ కుమార్‌పై నేరం రుజువు అయింది. దీంతో ఆలమూరు జెఎఫ్సిఎం కోర్టు న్యాయమూర్తి ఐ.ప్రవీణ్ కుమార్ నిందితుడు సతీష్‌కుమార్‌కు రెండేళ్ల జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమాన విధిస్తూ శుక్రవారం తీర్పు ఇచ్చారని ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపారు.

ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి జైలు

ప్రజాశక్తి-ఆలమూరు

ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించిన నేరంపై నిందితునికి జైలు శిక్ష విధించినట్లు శుక్రవారం ఎస్ఐ ఎల్.శ్రీనునాయక్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం 2022 డిసెంబర్ 16న కామవరపుకోట మండలంలోని పాతకొండగూడెంకు చెందిన చీకట్ల సతీష్(సత్తిపండు) పెండింగ్ ట్రైల్ నిందితుడిగా ఉన్నాడు. అదే రోజు సతీష్ ను కొత్తపేట పిఎస్‌లో యుటిపి ఎస్కార్ట్ గా పనిచేస్తున్న ఎఎస్ఐ అడబాల వెంకటేశ్వరరావు మరికొందరు కలిసి ఆలమూరు జిఎఫ్ సిఎం కోర్టుకు వాయిదా నిమిత్తం తీసుకొని వచ్చారు. నిందితుడు సతీష్ కోర్టు ఆవరణలో పెద్దగా కేకలు వేయడంతో వానిని సముదాయించే ప్రయత్నం చేశారు. దీంతో బెదిరింపు ధోరణికి దిగిన నిందితుడు సతీష్ పై అప్పటి ఎస్ఐ ఎస్.శివప్రసాద్ కేసు నమోదు చేశారు. తిరిగి 2022 డిసెంబర్ 27న సతీష్‌ను పీటీ వారింటి పై కోర్టులో హాజరు పరిచారు. కోర్టులో ఏపీపీ శ్రీరాములు వాదనలు వినిపించగా కోర్టు హెడ్ కానిస్టేబుల్ జి.ప్రభాకర్ రావు సహకరించారు. చివరకు నిందితుడు సతీష్ నేరం రుజువు కావడంతో ఆలమూరు జెఎఫ్సిఎం కోర్టు న్యాయమూర్తి ఐ.ప్రవీణ్ కుమార్ నిందితుడు సతీష్‌కు 6 నెలలు జైలు శిక్ష, రూ.2 వేలు జరిమాన విధిస్తూ శుక్రవారం తీర్పు ఇచ్చారని ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపారు.

అట్రాసిటీ కేసులో నిందితునికి జైలు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులో నిందితునికి కోర్టు జైలు శిక్ష జరిమానా విధించిందని, ఎస్ఐ కెఎం జోషి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇవి.. చల్లపల్లికి చెందిన బుడితి రమణ 2018 జనవరి 13న తన వరిచేల్లో నాట్లు వేసుకుంటుండగా అదే గ్రామానికి చెందిన కుంపట్ల చోడేశ్వరరావు సరిహద్దు విషయమై తనను కొట్టి గాయపరిచి కులం పేరుతో దూషించి చంపుతానని తనను బెదిరించాడంటూ స్థానిక పోలీస్ స్టేషన్ లో రమణ ఫిర్యాదు చేశాడు. దీనిపై అప్పటి ఎస్ఐ బి.రామకష్ణ ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేశారని తెలిపారు. కేసును అప్పటి ఎస్‌సి, ఎస్‌టి సెల్ డిఎస్‌పి పి.సోమశేఖర్ ఆధ్వర్యంలో దర్యాప్తు జరిపి నిందితుడు చోడేశ్వరరావును అరెస్టు చేసే కోర్టులో హాజరపరచగా కోర్టు రిమాండ్ విధించిందని తెలిపారు. నేరం రుజువు కావడంతో శుక్రవారం రాజమహేంద్రవరం పదవ అడిషనల్ కమ్ ఎస్‌సి, ఎస్‌టి కోర్టు జడ్జి ఆర్.శ్రీలత నిందితుడు చోడేశ్వరరావుకు ఏడాది జైలు శిక్ష రూ.10 వేలు జరిమానా విధించారన్నారు. ప్రాసిక్యూషన్ తరపున పిపి జి.వెంకటరత్నం బాబు వాదనలు వినిపించారని తెలిపారు.కేసు దర్యాప్తులో కషిచేసిన అప్పటి ఎస్ఐ,రామకష్ణ, దర్యాప్తు అధికారి డిఎస్‌పి, సోమశేఖర్ ప్రస్తుత ఎస్ఐ జోషి, పిసి సురేష్‌లను ఎస్ పి ఎస్.శ్రీధర్ అభినందించారు.

ఎస్‌సి వర్గీకరణపై వ్యాఖ్యలకు ఖండన

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పంలో ఒక సమావేశంలో ఎస్‌సి వర్గీకరణ చేస్తామని అన్నమాటను వెనక్కి తీసుకోవాలని విశ్వజన కళా మండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టిల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడు కులాల మధ్య చిచ్చుపెట్టే విధంగా వర్గీకరణ చేస్తామని ప్రకటించడం సరికాదన్నారు. అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ ఎస్‌సి, ఎస్‌టిలను విభజించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. చంద్రబాబు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించరాడు.

తల్లిదండ్రులకు భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

వద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు భద్రత కల్పించాలని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు బుద్ధ రాజు సత్యనారాయణ రాజు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొందరు ఖర్చులు భరించలేక, సేవలు చేయలేక తల్లిదండ్రులను చూడడం లేదన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా తల్లిదండ్రులను చూసే బాధ్యత పిల్లలపై ఉందని బుద్ధ రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, అడబాల రత్నప్రసాద్, రేలంగి బాపిరాజు పాల్గొన్నారు.

సుదర్శన్ కుటుంబాన్ని ఆదుకుంటాం

ప్రజాశక్తి-కాజులూరు

సీనియర్ జర్నలిస్ట్ సుదర్శన్ రావు కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సుదర్శన్ రావు కుటుంబాన్ని మంత్రి సుభాష్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదర్శన్ రావు నిరంతరం ప్రజా సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువచ్చి ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండేవారన్నారు. 28 ఏళ్లుగా పత్రికా రంగంలో విశేష కృషి చేశారన్నారు. ఆయన కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేగల వెంకట సతీష్, చందాల బాబి, గుబ్బల నాగేంద్ర, గెద్దాల సత్తిబాబు, గెద్దాడ శ్రీనివాసరావు, రెడ్డి శేషారావు తదితరులు పాల్గొన్నారు.

30న వాకర్స్ ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

సర్పవరం భావనారాయణ స్వామి గుడి వద్ద శ్రీరాజ్యలక్ష్మి కళ్యాణ మండపంలో ఈ నెల 30న భావశ్రీ ఆర్థోపెడిక్ అండ్ ఇఎన్‌టి క్లినిక్, వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఎముకలు, కీళ్లు, నరాలు, వెన్నుముక సమస్యలు, చెవి, ముక్కు, గొంతు సమస్యలకు డాక్టర్ చల్లా భావతేజ, స్వాతి ఆకుల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వనున్నారు. ఈ శిబిరంలో రూ.1500 విలువ గల ఎముకల సాంద్రత పరీక్షలను ఉచితంగా నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాల్సిందిగా సర్పవరం పరిసర గ్రామ ప్రజలను డాక్టర్ చల్లా భావతేజ కోరారు.

చంటిబాబును కలిసిన అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-కిర్లంపూడి

టిడిపి మండల అధ్యక్షుడు చదరం చంటిబాబును మండలంలోని పలువురు అంగన్‌వాడీ టీచర్లు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు చంటిబాబుకు పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీచర్లు పాల్గొన్నారు.

తిరుపతిలో 'నేను బడికి పోతా'

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలం తిరుపతి గ్రామంలో అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలల ఆధ్వర్యంలో శుక్రవారం బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలనే లక్ష్యంతో 'నే బడికి పోతా' ర్యాలీ నిర్వహించారు. తిరుపతి గ్రామంలోని నెంబర్-1 మండల పరిషత్ పాఠశాల వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ గ్రామంలోని అన్ని వీధుల్లో సాగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎం.సీతారామ్, బి.భవాని మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరూ బడికి వెళ్లి చదువుకునేలా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎన్.ఉమాదేవి మాట్లాడారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధులు, అంటు రోగాలు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రతకు కృషి చేయాలన్నారు. అనంతరం గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివిన బాలలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం సునీత, వెల్ఫేర్ సెక్రెటరీ లక్ష్మి, ఉపాధ్యాయులు జ్యోతిర్మయి, రేఖ, అంగన్‌వాడీ టీచర్లు అచ్చియ్యమ్మ, వరలక్ష్మి, నూకరత్నం, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

పెన్షన్‌దారుల అర్హతా పత్రాల పరిశీలన

ప్రజాశక్తి-కోటనందూరు

కొత్తకొట్టం, లక్ష్మీదేవి పేట సచివాలయాల పరిధిలోని పెన్షన్‌దారుల అర్హతా పత్రాలను ఎంపిడిఒ ఎం.జయ మాధవి శనివారం పరిశీలించారు. ఆ గ్రామాల సచివాలయాల పరిధిలో 111 మంది అనర్హులు పెన్షన్లు తీసుకుంటున్నట్లు టిడిపి నాయకులు డిఆర్‌డిఎ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో పెన్షన్ తీసుకుంటున్న వారి అర్హత పత్రాలను పరిశీలించినట్లు ఎంపిడిఒ తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు పూర్తిస్థాయిలో నివేదికను అందజేస్తామని ఎంపిడిఒ తెలిపారు.

పటవల పంట కాలువకు మోక్షం

ప్రజాశక్తి - తాళ్లరేవు

కొద్ది నెలలుగా పూడుకతో, గడ్డితో మూసుకుపోయిన పంట కాలువకు మోక్షం కలిగింది. ఉపాధి హామీ పథకంలో భాగంగా పటవల పంచాయతీలోని శాంతమూల వంతెన నుంచి కోరంగి వంతెన వరకు ఉన్న ప్రధాన పంట కాలువలో ఉపాధి కూలీలు శుక్రవారం చెత్త పూడిక తొలగించారు. ఈ ఉపాధి పని వల్ల రైతాంగానికి మేలు జరుగుతుందని స్థానిక రైతులు భజన సత్తిబాబు ఆనందం వ్యక్తం చేశారు. ఈ పంట కాలవ ఆధారంగా రాబోయే రోజుల్లో పటవలలో తాగునీటి చెరువు ఏర్పాటు, టాంకు నిర్మించుకుని, ప్రజల దాహార్తి తీర్చే ఏర్పాట్ల కోసం ఎంఎల్ఎ దాట్ల దాట్ల సుబ్బరాజును కోరనున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఉపాధి పనిలో స్థానికులు మేకల కృష్ణ, దంగేటి అన్వేష్, బోనం శ్రీను ఆనందం వ్యక్తం చేసిన వారిలో ఉన్నారు.

సత్యదేవుని ఆదాయం రూ.1.65 కోట్లు

ప్రజాశక్తి-అన్నవరం

అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామికి హుండీల ద్వా రూ.1,65,05,994 ఆదాయం లభించింది. శుక్రవారం కొండపైన దేవస్థానం ఇఒ కె.రామచంద్ర మోహన్, చైర్మన్ రాజా ఐవి రోహిత్ సమక్షంలో దేవస్థానం అధికారులు 29 రోజుల్లో వచ్చిన వివిధ హుండీలలో కానుకలను లెక్కించారు. ఈ లెక్కింపులో నగదుతో పాటు 51 గ్రాములు బంగారం, 633 గ్రాముల వెండి, ఇంకా వివిధ దేశాలకు చెందిన కరెన్సీ లభించింది. స్వామివారికి రోజుకు సగటున రూ.5.59 లక్షల ఆదాయం వస్తున్నట్లు దేవస్థానం అకౌంట్స్ విభాగం పర్యవేక్షణ అధికారి అనకాపల్లి ప్రసాద్ తెలిపారు. ఈ హుండీల లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం అధికారులు వ్రత పురోహితులు సిబ్బంది శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

సీజన్ మారిన క్రమంలో దగ్గు, జలుబు, విష జ్వరాలు వేధించే అవకాశం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రాణిక్ హీలింగ్ వైద్యురాలు ఎం.వరలక్ష్మి పేర్కొన్నారు. రమణయ్యపేట, రాయుడుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వర్షాకాలంలో జ్వరాలతో పాటు తీవ్రమైన తలనొప్పి, ఒళ్లు నొప్పులతో బాధపడుతుంటారని అన్నారు. దీని నివారణకు వర్షంలో తడవరాదని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిలవ లేకుండా చూడాలన్నారు. నిలువ ఉన్న ఆహార పదార్థాలు, రోడ్ల వెంబడి అమ్మే ఆహార పదార్థాలను తీసుకోరాదని వరలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, కె.సత్యనారాయణ, అంగన్వాడీ కార్యకర్త అనురాధ, స్థానికులు పాల్గొన్నారు.

తాగునీటి నమూనాల పరిశీలన

ప్రజాశక్తి -సామర్లకోట

సామర్లకోట పట్టణ ప్రజలకు కొళాయిల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటిలో క్లోరినేషన్ శాతాన్ని పరిశీలించేందుకు నీటి నమూనాలను శుక్రవారం అధికారులు సేకరించారు. పబ్లిక్ హెల్త్ ఎస్ఇ ఎండీ హుస్సేన్ సామర్లకోటలో తాగునీటి నమూనాలను సేకరించి పరిశీలించారు. క్లోరిన్ శాతంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు మాట్లాడుతూ పట్టణంలో నాలుగు సర్వీసు రిజర్వాయర్ ట్యాంక్‌లను పరిశుభ్రం చేసినట్లు ఎస్ఇకి వివరించారు. కాగా డయే రియా కేసులు నమోదవుతున్న క్రమంలో తాగునీటి విషయంలో అత్యంత జాగ్రత్త వహించాలని ఎస్ఇ కమిషనర్‌కు సూచించారు. ఈ సందర్భంగా వారి వెంట వాటర్ వర్క్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎల్ఎను కలిసిన నాయకులు

బలహీన వర్గాల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి - సామర్లకోట

బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సామర్లకోట పట్టణ నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు శుక్రవారం ఎంఎల్ఎను అచ్చంపేటలోని ఆయన గృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్‌ను వారు ఘనంగా సత్కరించారు. ఆదరణ యూనిట్లను, టిడిపి ప్రభుత్వ హయాంలో అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

యానాం వార్తలు

ధర్నా చేస్తున్న చేపల వ్యాపారస్తులు

ఆర్ఎఒ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - యానాం

స్థానిక మార్కెట్ కాంప్లెక్స్‌లో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో చేపలు విక్రేతలు శుక్రవారం ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. మార్కెట్లో క్లీనింగ్ సరిగా లేదని, తాగునీటి సదుపాయం లేదని, బ్లీచింగ్ కూడా చల్లడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చేపలు కొనుక్కోవడానికి వచ్చిన వారు జారి పడకుండా మ్యాట్లు ఏర్పాటు చేయాలని అనేకమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. తమ సమస్యలకు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తోటి మహిళా వ్యాపారి జారి పడడంతో ఈ ఆందోళనను చేపట్టారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకష్ణ ఆందోళనకారుల దగ్గరకు వచ్చి సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీ ఇవ్వడంతో వారు ధర్నాను విరమించారు.

మున్సిపల్ పాఠశాలను కొనసాగించాలి

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట జగ్గమ్మగారి పేటలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను నూతన భవనం నిర్మించి కొనసాగించాలని వార్డుకు చెందిన కౌన్సిలర్లు పితాని కృష్ణ, బలుసు వాసు అధికారులను కోరారు. ప్రస్తుతం అన్న క్యాంటీన్‌లో కొనసాగుతున్న పాఠశాలను సమీపంలోని వేరొక పాఠశాలలో విలీనం చేసే ప్రయత్నం జరుగుతున్నందున అది ఎంతమాత్రం తగదని మునిసిపల్, విద్యా శాఖ అధికారులను హెచ్చరించారు. అన్న క్యాంటీన్‌లో పాఠశాలలో హెచ్ఎం, ఉపాధ్యాయులతో వార్డు పరిధిలోని కౌన్సిలర్లు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లితండ్రులు సైతం తమ వార్డులో ఉన్న పాఠశాలను వేరే పాఠశాలలో కలపడం అన్యాయమన్నారు. వార్డు ప్రజల నిర్ణయాన్ని ఉన్నతధికారుల దృష్టికి తీసుకెళ్లి పాత పాఠశాల భవనం స్థలంలోనే కొత్త భవనాన్ని నిర్మించి పాఠశాలను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

29న ఆర్‌విఎన్ స్టడీ సర్కిల్ సదస్సు

ప్రజాశక్తి-కాకినాడ

రఘుపతి వెంకటరత్నం నాయుడు స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఈ నెల 29న సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆర్‌విఎన్ స్టడీ సర్కిల్ కన్వీనర్ ఎన్.గోవిందరాజులు ఒక ప్రకటనలో తెలిపారు. మందుల రంగంలో మార్పులు-ప్రజలపై ప్రభావం అనే అంశంపై నిర్వహించే ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యువి.కృష్ణయ్య ముఖ్యవక్తగా హాజరవుతారని తెలిపారు. ఈ సదస్సుకి అందరూ ఆహ్వానితులే అని గోవిందరాజులు ప్రకటనలో తెలిపారు.

ప్రకటన
మహారాజశ్రీ పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
సి.ఎమ్.ఎ. 2/2022

బిట్వీన్:
పీతల లక్ష్మి వగైరాలు -అప్పిలెంట్స్/వాదులు
మరియు
నేతల జనార్ధనరావు వగైరాలు -రెస్పాండెంట్స్/ప్రతివాదులు

2వ రెస్పాండెంట్: పులి చంద్రమ్మ, W/o. లేటు అప్పారావు, వయస్సు 65 సం॥రంలు, ఎస్.సి.పేట, శంఖవరం, శంఖవరం మండలం, కాకినాడ జిల్లా, ఆంధ్రప్రదేశ్.

5వ రెస్పాండెంట్: పాలిక జయలక్ష్మి, W/o. వెంకటేశ్వరరావు, వయస్సు 54 సం॥రంలు, ఎస్.సి.పేట, గొంచాల, సామర్లకోట మండలం, కాకినాడ జిల్లా, ఆంధ్రప్రదేశ్.

పై నెంబరు పిటీషన్ సిఎమ్ఎ 2/22 నందు శ్రీ కోర్టు వారు 2వ రెస్పాండెంట్ & 5వ రెస్పాండెంట్స్‌కు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనకుండా త్రిప్పి పంపించి వేయుచున్నందున ఇందుమూలముగా ఈ ప్రకటన ద్వారా శ్రీ పై కోర్టు వారు జారీ చేసిన నోటీసు ప్రకారంగా 2వ రెస్పాండెంట్/ 2వ ప్రతివాది మరియు 5వ రెస్పాండెంటు/ 5వ ప్రతివాది హాజరు నిమిత్తం ది. 05-07-2024 సం॥రం తేదీన వాయిదా ఉన్నది. ది. 05-07-2024 తేదీ ఉదయం 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, న్యాయవాది కృతంగా గాని హాజరు కావలెను. అట్లు కాని యెడల పై నెంబరు పిటీషను మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)

రెడ్డిపల్లి సీతన్న
కె.నారాయణరెడ్డి
అడ్వకేట్స్, పిఠాపురం
సెల్: 9848562162

ఊబిలో కూరుకుని కూలీ మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు గ్రామంలో తాగునీటి చెరువు శుభ్రం చేస్తున్న కూలీ ఊబిలో ఊరికిపోయి మృతి చెందినట్లు కోరంగి పోలీసులు తెలిపారు. ఐ.పోలవరం మండలం భైరవపాలెంకి చెందిన కొప్పాడి అచ్చయ్య (48) శుక్రవారం చెరువులో పనికి వెళ్లారు. అందరితో శుభ్రం చేస్తున్న సమయంలో లోపల ఊబిలో కూరుకుపోయాడు. ఇది గమనించిన తోటి కూలీలు అతని కోసం గాలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కోరింగ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ సర్పంచ్ ఇంట్లో చోరీ

ప్రజాశక్తి- చాగల్లు

చాగలు మాజీ సర్పంచ్, మాజీ ఎంపిపి, టిడిపి సీనియర్ నాయకులు కేత సాహెబ్ ఇంట్లో చోరీ జరిగిందని ఎస్ఐ పి.నాగరాజు తెలిపారు. గురువారం సాహెబ్ కుటుంబంతో కలిసి వేరే ఊరు వెళ్లారు. శుక్రవారం ఉదయం పనిమనిషి వచ్చిచూడగా తలుపులు తాళాలు పగులగొట్టినట్లు గుర్తించింది. వెంటనే సాహెబ్‌కు ఫోన్‌లో సమాచారం ఇచ్చింది. హుటాహుటిన ఆయన ఇంటికి వచ్చి పరిశీలించారు. 100 తులాలు వెండి వస్తువులు, 24 కాసుల బంగారం, రూ.25వేల నగదు చోరీ గురైనట్టు గురించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదుచేశారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

జిఎంఆర్, ఐఎఎస్ కంపెనీల పేర మోసం

ప్రజాశక్తి-రామచంద్రపురం

కాకినాడు కేంద్రంగా కొందురు వ్యక్తులు జిఎంఆర్, ఐఎఎస్ కంపెనీల పేర మోసాలకు పాల్పడ్డారు.

కాకినాడ కేంద్రంగా బుక్కరి ఆనంద్‌తో పాటు మరో ఇద్దరు వ్యక్తులు కలిసి పలు ప్రాంతాల్లో సైబర్ క్రైమ్‌కు తెర లేపారు. జిఎంఆర్, ఐఎఎస్ కంపెనీల పేరు మీద ఒక్కొక్క వ్యక్తి నుంచి రూ.18 వేల నుంచి రూ.40 వేల వరకు వసూలు చేశారు. గతేడాది నవంబర్ నుంచి మొదలైన ఈ సైబర్ క్రైమ్ లో సుమారు 1000 మంది యువకులు జాయిన్ అయ్యారు. కంపెనీ నిబంధన ప్రకారం రూ.18000 కట్టిన ప్రతి ఒక్కరికి రోజుకు రూ.500 చెల్లిస్తామని నమ్మం పలకడంతో యానాం, కాకినాడ, ద్రాక్షారామం, రామచంద్రపురం, కె.గంగవరం, అమలాపురం తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున యువకులు ఇజిఎంఆర్ వలలో చిక్కుకున్నారు. దీనికి సంబంధించిన యాప్ గురువారం నుంచి పని చేయకపోవడంతో యువకులంతా పెద్ద ఎత్తున శుక్రవారం ద్రాక్షారామం పోలీస్ స్టేషన్ చేరుకుని దీనికి సంబంధించిన ముగ్గురు వ్యక్తులను తీసుకువచ్చారు. తామంతా రూ.వేలు చెల్లించామని తమకు న్యాయం చేయాలని ద్రాక్షారామం ఎస్ఐ సురేంద్ర దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఎస్ఐ మాట్లాడుతూ బాధితులంతా ఆయా సంబంధత పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయాలని దీనిపై తాము దర్యాప్తు చేస్తామని వివరించారు. వెయ్యి మంది యువకులు సుమారు రూ.2కోట్ల వరకు చెల్లించినట్లు ఇక్కడ తెలిపిన వివరాలు ప్రకారం అర్థమవుతుంది.

ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ వద్ద బాధితులు

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి
(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

ఆసెట్‌లో 'శ్రీ వెంకటేశ్వర' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

ఆసెట్ పరీక్షా ఫలితాలు గురువారం రాత్రి విడుదల అయ్యాయి.ఈ ఫలితాల్లో అమలాపురం శ్రీ వేంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు కరస్పాండెంట్ కెబిఆర్ఎన్ నరసింహరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా స్టాటిస్టిక్స్ విభాగంలో విద్యార్థిని కేశనకుర్తి సత్యవాణి 2వ ర్యాంకు, రాయుడు ప్రజ్ఞ 7వ ర్యాంకు సాధించగా ఎస్.అయ్యప్ప శర్మకు 27వ ర్యాంకు, ఎ.గణేష్ 64వ ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపల్ కె.మనోహర్ తెలిపారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కరాటం ప్రవీణ్, కె.శ్రావణ్ దిలీప్, డాక్టర్ హేమ విజిత, కె.సౌందర్య, యాలంగి వర ప్రసాద్, సిహెచ్.జాన్ పాల్, ఎం.విజయలక్ష్మి తదితరులు అభినందించారు

ముచ్చిమిల్లి సచివాలయంపై దాడి

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం పట్టణం17వ వార్డులో ముచ్చిమిల్లి సచివాలయం గుర్తు తెలియని వ్యక్తులు పేడ, మట్టితో దాడి చేశారు. దీనిపై పోలీసులు, ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని దాడికి పాల్పడి ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

భోజనాన్ని తనిఖీ చేస్తున్న మంత్రి సుభాష్

ఎస్‌సి హాస్టల్ నిర్వహణపై మంత్రి ఆగ్రహం

ప్రజాశక్తి -రామచంద్రపురం

పట్టణంలో గల ప్రభుత్వ ఎస్‌సి బాలుర వసతి గృహన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం పరిశీలించారు. సంక్షేమ హాస్టల్లో అసౌకర్యాలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ రికార్డును తనిఖీ చేసి విద్యార్థుల వసతి సదుపాయాలను మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసు కున్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, శానిటైజేషన్‌పై ఆరా తీసి అక్కడ ఉన్న అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. పెచ్చులూ డిపోయిన హాస్టల్ భవనం సక్రమంగా లేని నిర్వహణ తీరుపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్యం, టాయిలెట్ నిర్వహణపైనా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. వీటన్నిటిని సరిదిద్దాలని హాస్టల్ అధికారులకు సూచించారు.

డయేరియా బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

డయేరియా బారిన పడకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని వాకతిప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిహెచ్ఒ జి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం టేకి జెడ్‌పి ఉన్నత పాఠశాల, బిసి ఏరియా ప్రాథమిక పాఠశాల అంగనవాడి కేంద్రంలో ఆయన డయేరియా వంటి వ్యాధుల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు, రాకుండా చర్యలు తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. పరిశుభ్రతను పాటిస్తూ పరిసరాలు శుభ్రంగా ఉంచుతూ సరైన ఆహారంతో పాటు రక్షిత నీరు త్రాగాలని సూచించారు . ఈ సందర్భంగా డయేరియా వ్యాధి బారిన పడినట్లయితే టాబ్లెట్లతో పాటు ఒఆర్ఎస్ ప్యాకెట్లు విద్యార్థులకు అందజేసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ప్రసాద్, బిసి ఏరియా ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కెవి రమణ, ఎఎన్ఎం రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, పాల్గొన్నారు .

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

CHANGE OF NAME

I, JUGRAJ JAIN, S/o. Hanjarimal Jain, D.No. 32-5-20, Meraka Street, Rajahmundry, E.G.Dist., A.P., PIN: 533101. I have changed my Name from **HANJARIMAL JUGRAJ** (Old name) to **JUGRAJ JAIN** (New name). Henceforth I am being called **JUGRAJ JAIN,** S/o. **Hanjarimal Jain,** for all purpose.

CHANGE OF NAME

I **THOTAKURA VEERABABU** (new name) S/o thotakura Devendra Rao resident of D.No.3-24/C, Bhuvaneswari Street, Kuvvuru Village, Kakinada Rural, Kakinada District. India. I have changed my name from **Totakura Veerababu** (Old Name) to **Thotakura Veerababu** (new name). Henceforth be known / called as **Thotakura Veerababu**. This is for kind information to all concerned.

- THOTAKURA VEERABABU

పాస్‌పోర్టు పోయినది

తూర్పుగోదావరి జిల్లా, గోపాలపురం మండలం, చిట్యాల గ్రామానికి చెందిన కోట గంగ, W/o. గోవిందు అను నాకు పాస్‌పోర్టు నెంబరు **M5830112** కలదు. నా యొక్క వ్యక్తిగత పనుల మీద మా గ్రామం చిట్యాల నుండి గోపాలపురం మోటారు బైక్ మీద వెళ్ళుచుండగా మార్గం మధ్యలో పడిపోయినది. ఎంత వెతికినను దొరకలేదు. దొరికినవారు ఈక్రింది అడ్రసుకు, ఫోన్ నెంబరకు తెలియజేయగలరు.

కోట గంగ
W/o. గోవిందు, డో.నెం. 5-62
కొత్త వాటర్ ట్యాంకు, చిట్యాల గ్రామం
గోపాలపురం మండలం, తూ॥గో॥జిల్లా
సెల్: 8790830499

జనరల్ నోటీసు పబ్లికేషన్
మహారాజశ్రీ ఆలమూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఒ.యస్. నెం. 60/2023

బిట్వీన్:
గంటి జార్జిబాబు, తండ్రి: లేటు శేషయ్య, వయస్సు 56 సం॥లు, డోరు నెం. 1-131, హరిజనపేట, టేకి, కపిలేశ్వరపురం మండలం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా. -పిటీషనర్
అండ్
నిల్ -రెస్పాండెంట్

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, కపిలేశ్వరపురం మండలం, టేకి గ్రామ వాస్తవ్యులు, గంటి శేషయ్య గారి కుమారుడు గంటి జార్జిబాబుకి కోరుమిల్లి గ్రామంలో ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూమి తన మేనమామ అయిన మచ్చా మాచరయ్య గారి కుమారుడు మచ్చా వనమయ్య గారు ది. 10-11-2014 సం॥రం తేదీన అన్‌రిజిష్టర్డు వీలునామా ద్వారా తదనంతరం దఖలుపడేలా వ్రాయించినారు. సదరు మచ్చా వనమయ్య గారు ది. 03-11-2016వ తేదీన మరణించగా, అప్పటి నుండి సదరు ఆస్తిని గంటి జార్జి గారు అనుభవించుచున్నారు. సదరు ఆస్తిపై గౌ॥ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, ఆలమూరు కోర్టులో డిక్లరేషన్ దావా దాఖలు చేసియున్నారు.

దీనిపై పై నెంబరు డిక్లరేషను దావాలో ఎవరికైననూ ఎట్టి అభ్యంతరములు ఉన్న ఎడల పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని **01-07-2024వ తేదీ ఉదయం గం॥ 10.30 ని॥లకు** హాజరై తమ అభ్యంతరములు తెలియపరచుకొనవచ్చును. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియపర్చడమైనది.

షెడ్యూలు: డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, కపిలేశ్వరపురం మండలం, కోరుమిల్లి గ్రామం, ఆలమూరు సబ్-రిజిస్ట్రార్, కోరుమిల్లి రెవిన్యూ సర్వే నెం. 180/3రు పూరా య. 3-68 సెంట్లులో య. 0-22 సెంట్లుకు హద్దులు.

ఉత్తరం: చిట్టూరి వీర్రాజు గారు, రాయపాటి వారి దగ్గర కొనుగోలు చేసిన భూమి. **దక్షిణం:** యర్రంశెట్టి వారి భూమి. **తూర్పు:** చిట్టూరి వీర్రాజు గారు, రాయపాటి వారి దగ్గర కొనుగోలు చేసిన భూమి. **పడమర:** పంట కాలువ.

(కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

వి.వెంకట్రావు
ఆలమూరు అడ్వకేట్, ఆలమూరు
ది.28-6-2024 సెల్: 9989955116